విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఎంపీడీఓ మహేశ్‌బాబు
- మధ్యాహ్న భోజనం పరిశీలించిన అధికారులు

దోమ: ప్రభుత్వ పాఠశాలలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంపీడీఓ మహేశ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను ఎంపీఓ సోమలింగంతో కలిసి వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపట్టిందన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలన్నారు.



దోమ: మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ మహేశ్‌బాబు

పౌష్టికాహారం పెట్టాలి: ఎంపీడీఓ విజయలక్ష్మి

మోమిన్‌పేట: రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి పాఠశాలలో పౌష్టికాహారం పెట్టాలని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏన్కతల ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథక అమలును ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మధ్యాహ్న భోజన పథకంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఏజెన్సీలను, ప్రధానోపాధ్యాయులపై చర్యలు తప్పవన్నారు. పురుగులు లేకుండ భోజనం అందించాలని సూచించారు. ప్రతీ రోజు మెనూ ప్రకారం భోజనంపెట్టాల్సిందేనన్నారు. బియ్యంలో పురుగులు ఉన్నట్లయితే వెంటనే వాపస్‌పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభువు, ఎంఈఓ మల్లేశం, వైద్యాధికారి రశీదు, ఆర్‌ఐ గోవర్ధన్, కార్యదర్శి నర్సింలు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: మండల పరిధిలోని అంగడి రాయిచూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తహశీల్దార్ విజయ్‌కుమార్ పరిశీలించారు. మధ్యాహ్న భోజనంలో వండుతున్న బియ్యాన్ని తనిఖీ చేశారు. వంట గది పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. తహశీల్దార్‌తో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి: తహశీల్దార్ విజయ్‌కుమార్

బంట్వారం: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని తహశీల్దార్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన బంట్వారం కేజీబీవీ హాస్టల్‌ను సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. కిచెన్‌షెడ్‌తో పాటు డైనింగ్ హాల్, సరుకులు, కూరగాయల నిల్వ గదిని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే ధైర్యంగా చెప్పాలన్నారు. భోజనం రుచికరంగా ఉందా? లేదా అంటూ ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. తను హాస్టల్‌ను సందర్శించిన సమయంలో ఇంచార్జి ఎస్‌ఓ విధుల్లో లేరని ఆయన పేర్కొన్నారు.



మోమిన్‌పేట: సహపంక్తి భోజనం చేస్తున్న ఎంపీడీఓ విజయలక్ష్మి



కొడంగల్: సహపంక్తి భోజనం చేస్తున్న తహశీల్దార్ విజయ్‌కుమార్



బంట్వారం: కేజీబీవీలో సమస్యలు తెలుసుకుంటున్న తహశీల్దార్ విజయ్‌కుమార్

క్లుప్తంగా

నేడు ధారూరుకు రానున్న శాసనసభ స్పీకర్

ధారూరు: ధారూరు వ్యవసాయ కమిటీ పాలక వర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాన్‌సింగ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. ధారూరు మండల కేంద్రంలోని శుభం ఫంక్షన్‌హాల్లో ఉదయం 11 గంటలకు నిర్వహించే కార్యక్రమానికి శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. స్పీకర్‌తోయ పాటు తాండూర్ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి హాజరు కానున్నారని, పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి



నవీన్‌రెడ్డిని పరామర్శిస్తున్న పట్నం మహేందర్‌రెడ్డి

తాండూరు రూరల్: కార్యకర్తలకు అండగా ఉంటానని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. తాండూరు మండలం కోత్లాపూర్ గ్రామానికి చెందిన రేణుక ఎల్లమ్మ ఆలయ చైర్మన్ పట్లోళ్ల నవీన్‌రెడ్డి తల్లి అరుణమ్మ మృతి చెందిన విషయం తెలుసుకుని పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం కోత్లాపూర్ గ్రామానికి వెళ్లి నవీన్‌రెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కరణం పురుషోత్తం రావు, బలవంత్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బలవంత్‌రెడ్డి, అబ్దుల్ కవి, బీదర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి కృషి చేస్తాం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



పనులు ప్రారంభిస్తున్న మంజుల

అనంతగిరి: అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ సహకారంతో వికారాబాద్ మున్సిపల్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల పేర్కొన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని పలు వార్డుల్లో 15వ ఆర్థిక సంఘం నిధులతో యూజీడీ పైప్‌లైన్, మ్యాన్‌హోల్స్ మరమ్మతు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్‌కుమార్, కౌన్సిలర్లు సంతోషనర్సింలు, సునీత రమేష్‌గౌడ్, మల్లికార్జున్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



నేరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పరిగి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని బస్టాండ్‌లో విద్యార్థులకు, ప్రయాణికులకు ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు తల్లిదండ్రులకు సైబర్ నేరాలు ఎలా జరుగుతున్నాయో వివరించాలని సూచించారు. అపరిచితులు ఫోన్లు చేసి ఓటీపీలు చెప్పమంటే చెప్పొద్దని తల్లిదండ్రులకు సూచించాలన్నారు. ఏసమస్యలు ఉన్న నేరుగా బ్యాంకుకు వెళ్లి పరిష్కరించుకోవాలన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ఘనంగా స్వయంపరిపాలన దినోత్సవం



విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వీరేశం, శ్రీనివాస్, రమేష్, తిరుపతిరెడ్డి, సోమ్లా, లక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల పాత్ర కీలకం

ఆర్టీసీ డీఎం కరుణశ్రీ



ఉద్యోగుల వనభోజన కార్యక్రమంలో కరుణశ్రీ

పరిగి: ఆర్టీసీ అభ్యున్నతికి ఉద్యోగుల పాత్ర కీలకమని పరిగి ఆర్టీసీ ఎండీ కరుణశ్రీ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో ఉద్యోగులతో కలిసి కార్తీక మాస వనభోజన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఆర్టీసీకి మంచి ఆదాయం అందించేది ఉద్యోగులేనని అందులో డ్రైవర్లు, కండక్టర్లు ప్రతిఒక్కరి కృషి దాగుందన్నారు. విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరించి మంచిగా పనిచేసే వారికి సంస్థ ఎల్లప్పుడు గుర్తిస్తు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. ఉద్యోగులందరితో కలిసి వనభోజనం నిర్వహించడం, క్రీడల్లో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

రాములు యాదవ్ కుటుంబానికి పరామర్శ

పెద్దేముల్: మండల పరిధిలోని జనగాం మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు రాములు యాదవ్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకొని ప్రభుత్వ చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి శుక్రవారం రాములు యాదవ్ కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాములు యాదవ్‌తో ఉన్న సన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు.

రైతుల పోరాట ఫలితమే ఫార్మా రద్దు

పరిగి: ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం రైతులను ఎన్ని విధాల ఇబ్బందులకు గురిచేసినా పట్టు వీడకుండా పోరాటం చేసినందుకే ప్రభుత్వం ఫార్మా కంపెనీ రద్దు చేసిందని పలువురు నాయకులు పేర్కొన్నారు. ఇది రైతుల విజయం అని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు గట్యానాయక్ తెలిపారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులకు గిరిజన సంఘాలు, ప్రజా సంఘాల మద్దతుతోనే ప్రభుత్వం వెనక్కి తగ్గి ఫార్మా కంపనీ ఏర్పాటును ఉపసంహరించుకుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవింద్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: లగిచెర్లలో ఫార్మా కంపెనీ ఏర్పాటు వద్దని ఆ గ్రామాల రైతుల వీరోచిత పోరాటానికి , బీఆర్‌ఎస్ ఉద్యమానికి ప్రభుత్వం వెనక్కి తగ్గిందని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ రైతులకు మద్దతుగా పోరాటం చేసిందని గుర్తు చేశారు.

హర్షం వ్యక్తం చేసిన సీపీఎం నాయకులు

లగిచెర్ల ఫార్మ కంపెనీ భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయడాన్ని సీపీఎం నాయకులు హర్షం వ్యక్తం చేశారని జిల్లా కార్యదర్శి మైపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.

దుద్యాల్‌లో..

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల, హకీంపేట్, పోలేపల్లి, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా గ్రామాల్లో ఏర్పాటు చేయాలనుకున్న ఫార్మా కంపనీని ప్రభుత్వం రద్దు చేస్తున్నట్లు శుక్రవారం ప్రకటించడంతో సీపీఎం నాయకుడు వెంకటయ్య, బుస్స చంద్రయ్య ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఫార్మా కంపెనీ రద్దు చేయాలని రైతులతో కలిసి పోరాటం చేశామని గుర్తు చేశారు. ఎక్కడైన రైతులకు సమస్యలు వచ్చిన కూడా సీపీఎం ముందంజలో ఉండి పోరాడుతుందన్నారు.

రైతుల విజయం

కొడంగల్: దుద్యాల మండల పరిధిలోని లగచర్ల, రోటిబండ తండా, పులిచర్లకుంట తండా, పోలేపల్లి, హకీంపేట గ్రామాల రైతులు పోరాడి విజయం సాధించారని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు ఎరన్‌పల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల సమస్యలను గల్లీ నుంచి ఢిల్లీ వరకు తీసుకెళ్లిన కుల సంఘాలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, వృత్తి సంఘాలు, ఫార్మా వ్యతిరేక పోరాటానికి మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి పాదాభివందనాలు తెలిపారు. ఫార్మా వ్యతిరేక పోరాటంలో అరెస్టయిన వారిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.



పరిగి: మాట్లాడుతున్న గట్యానాయక్

రైతు సదస్సుకు తరలిరావాలి

దుద్యాల్: మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలం అమిస్తాపూర్ గ్రామంలో శనివారం నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి రైతు సదస్సుకు మండలానికి చెందిన రైతులు అధిక సంఖ్యలో తరలి రావాలని ఏఓ తులసి పేర్కొన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రైతు సదస్సులో వ్యవసాయ శాఖకు సంబంధించిన 150 రకాల ప్రదర్శనలు అందుబాటులో ఉంటాయన్నారు. అలాగే వ్యవసాయానికి సంబంధించిన పలు నూతన పరికరాలు, నూతన ఆవిష్కరణల ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు.

శివాజీ విగ్రహ ఏర్పాటుకు విరాళం

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటునకు మాజీ సర్పంచ్ విజయలక్ష్మి పండరి విరాళం అందజేశారు. శుక్రవారం గ్రామంలోని ఛత్రపతి శివాజీ యువజన సంఘం సభ్యులకు రూ.55వేలు అందజేశారు. ఈ విషయంలో దాతల సహకారం మరువలేనిదన్నారు.

కాంగ్రెస్ రైతు పక్షపాతి

తట్టేపల్లి పీఏసీఎస్ చైర్మన లక్ష్మారెడ్డి

పెద్దేముల్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని తట్టేపల్లి పీఏసీఏస్ చైర్మన్ లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పెద్దేముల్ మండలం తట్టేపల్లి గ్రామంలోని పీఏసీఏస్ కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న రైతు పండుగ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రాజమౌళి, మాజీ ఎంపీటీసీ శంకర్, జగదీష్, రైతులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులు బాధాకరం



బంట్వారం: పోలీసుల అదుపులో నాయకులు



పూడూరు: చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌లో..

బంట్వారం: హాస్టల్ విద్యార్థుల సమస్యలపై హైదరాబాద్ తరలివెళ్తున్న బీజేపీ కోట్‌పల్లి మండల నాయకులను శుక్రవారం పోలీసులు అరెస్టు చేసి ఠాణాకు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అక్రమ అరెస్టులు బాధాకరమన్నారు. అరెస్టులతో తమ పోరాటం ఆగదన్నారు. గురుకుల హాస్టల్ విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు.

పూడూరులో..

పూడూరు: ప్రభుత్వ గిరిజన విద్యాలయం, గురుకుల విద్యార్థుల హాస్టల్లో వడ్డిస్తున్న నాసిరకం ఆహారంపై ప్రశ్నిస్తే అరెస్టులు చేయడం ఏమిటని సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్‌పటేల్ ప్రశ్నించారు. శుక్రవారం బీజేపీ పిలుపుమేరకు నాసిరకం ఆహారం అందించడంపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముందస్తుగా అరెస్టు చేయడం సరైందికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదన్నారు. ప్రభుత్వం గురుకులాలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రవీందర్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీశైలం, గీతా సెల్ మండల అధ్యక్షుడు ప్రసాద్‌గౌడ్, పరిగి అసెంబ్లీ కోకన్వీనర్ మనోహర్‌గౌడ్, రాజు, నాయకులు నర్సింహారెడ్డి తదితరులను అరెస్టు చేసి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం

కొడంగల్: బీఆర్‌ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన దీక్షా దివాస్ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కొడంగల్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడారు. కొడంగల్ మండల పార్టీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ మధుయాదవ్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోట్ల యాదగిరి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ భీములు, ఎరన్‌పల్లి శ్రీనివాస్, వాహబ్, మెట్లకుంట సలీం, నారాయణరెడ్డి, సముద్రమ్మ, సలాం, మహేందర్, మడిగ శ్రీనివాస్, సోమనాథ్‌లు ఉద్యమ ప్రస్థానాన్ని గుర్తు చేసుకున్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

విద్యార్థులు గణితంలో ప్రతిభ చూపాలి

బషీరాబాద్: విద్యార్థులు గణితంలో ప్రతిభ చూపాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జెడ్పీఉన్నత పాఠశాలలో గణిత ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన నైపుణ్య పరీక్షలో వివిధ జెడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి 43 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయికి, అక్కడ నుంచి రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్న పరీక్షలకు ఎంపిక చేస్తారన్నారు. అనంతరం తహసీల్దార్ వెంకటేషం మాట్లాడారు. విద్యార్థులు పోటీ సమాజంలో గణితంపై పట్టు సాధించాలన్నారు.

జిల్లా స్థాయికి ఎంపిక

గణిత నైపుణ్య పరీక్షల్లో 43 మంది విద్యార్థులు పరీక్ష రాయగా తెలుగు, ఇంగ్లీష్ మీడియం నుంచి ముగ్గురు చొప్పున ఆరుగురు విద్యార్థులు ఎంపిక య్యారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ప్రధానోపాధ్యాయుడు హీర్యానాయక్, అరుణజ్యోతి, పీఆర్‌టీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రామ్ రెడ్డి, రాష్ట్ర అసోషియేట్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, మోడల్ హైస్కూల్ హెచ్‌ఎం అనిలా, గణిత ఫోరం మండల కోఆర్డినేటర్ రవికాంత్, నాగరాజు, వీరేశం, మండల ప్రధాన కార్యదర్శి రవి సుగంధి, రామలక్ష్మి, ఈ శ్రీనివాస్, విష్ణుప్రియ, వెంకటేశం, కవిత, లక్ష్మీబాయి, శివప్రసాద్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని కుల్కచర్ల మండల కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి గణిత ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి పాఠశాలల వారీగా ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన ట్యాలెంటు టెస్టులో ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో మధ్యాహ్నం నిర్వహించిన టెస్టులో మండల కేంద్రంతోపాటు రేగడిమైలారం, చౌదర్‌పల్లి, బొట్లోనితండా ఆశ్రమ పాఠశాల నుంచి ముగ్గురు చొప్పున హాజరయ్యారు. బొంరాస్‌పేట ఝూన్సీ, శైలజ, ఆశ్రమ పాఠశాల సబిత, తెలుగు మాధ్యమం నుంచి చౌదర్‌పల్లి సాయినాథ్, బొంరాస్‌పేట శివకుమార్, మౌనిక జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన విద్యార్థులను ఎంఈఓ హరిలాల్, మ్యాథ్స్ ఫోరం కన్వీనర్ అనిల్‌కుమార్ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాజన్న, మల్లయ్య, కాశయ్య, సుధారాణి, రతన్‌రాజ్, శ్యామలయ్య, నర్సింలు, భవాని, స్రవంతి పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: విద్యార్థులు గణితంపై మక్కువ పెంచుకోవాలని డీసీఈబీ (డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు) ప్రతినిధి వీరకాంతం అన్నారు. శుక్రవారం వికారాబాద్‌లోని జెడ్పీహెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో గణిత ఫోరం ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయిలో మ్యాథమెటిక్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేషం, గణిత ఫోరం ప్రతినిధులు వేణుగోపాల్, విష్ణువర్ధన్, జగదీశ్వరి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.



కుల్కచర్ల: పోటీ పరీక్షలో పాల్గొన్న విద్యార్థులు

మండల స్థాయి గణిత శాస్త్ర ప్రతిభ పరీక్ష

దుద్యాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి గణిత శాస్త్ర ప్రతిభ పరీక్షను శుక్రవారం నిర్వహించారు. ఈ పరీక్షకు పదోతరగతి విద్యార్థులు హాజరయ్యారు. దుద్యాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియం నుంచి 6గురు, హకీంపేట్ పాఠశాల నుంచి 6 గురు, కుదురుమల్ల పాఠశాల నుంచి ముగ్గురు, కేజీబీవీ చెట్టుపల్లి నుంచి ముగ్గురు మొత్తం 18మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఈ పరీక్షను మండల విద్యాధికారి విజయరామారావ్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఎంఈఓ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు రవీందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్: విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న ఫోరం సభ్యులు, ఉపాధ్యాయులు



అనంతగిరి: ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతుల ప్రదానం



బొంరాస్‌పేట: జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులతో ఎంఈఓ హరిలాల్, ఉపాధ్యాయులు